క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణను తిప్పి కొడదాం

చంద్రుగొండ: మాలలంతా ఐక్యతగా ఎస్సీ వర్గీకరణను తిప్పి కొడదామని మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతోటి కాంతయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రం చంద్రుగొండలోని అంబేత్కర్‌నగర్‌లో ఆదివారం జరిగిన మండలశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టికల్ 341ను ఆధారంగా చేసుకుని వర్గీకరణ సాధ్యకాదన్నారు. ఎస్సీ కులాల మధ్య చిచ్చుపెట్టిన బీజేపీ, టీడీపీ పార్టీలకు భవిష్యత్‌లో మాలలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న, నిర్వహించతలపెట్టిన భారత్‌బంద్‌ను జయప్రదం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాయి రాజా, వై.నర్సింహారావు, బేతి నాగబాబు, తంబళ్ళ మంగయ్య, లక్షణ్, రాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

భద్రాచలంటౌన్: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా ఈ నెల 21 జరిగే భారత్ బంద్ కరపత్రాలను ఆదివారం భద్రాచలం డాక్టర్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న భారత్ బంద్‌ను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, వెంకన్న, శివయ్య, సతీష్, సంతోష్, సందీప్, విక్రమ్, ప్రవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పినపాక: అనారోగ్యంతో బాధపడుతున్న యువతికి బీటీపీఎస్ సీఈ, గిరిజన సొసైటీ సభ్యులు, ఆదివాసీ బీటీపీఎస్ ఉద్యోగులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన యలగల సమత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న బీటీపీఎస్ ఆదివాసీ ఉద్యోగులు విషయాన్ని సీఈ బిచ్చన్న దృష్టికి తీసుకెళ్లగా.. ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సీఈ బిచ్చన్న, దమ్మక్కపేట, సాంబయ్య గూడెం, బయ్యారం గిరిజన సొసైటీ సభ్యులు, బీటీపీఎస్ ఉద్యోగులు కలిపి 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారికి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కుంజా సారయ్య, కుంజా కృష్ణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వాడ బలిజల మండల కమిటీ ఎన్నిక



మండల కమిటీ సమావేశంలో వాడబలిజ సంఘం నాయకులు

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో వాడ బలిజ సంఘం మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఎంబడి అర్జున్ రావు, కార్యదర్శిగా గౌరారపు సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా వాదం కృష్ణార్జున రావు, కోశాధికారి గౌరారపు నరసింహ రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్ మాట్లాడుతూ.. వాడబలిజలు అందరూ ఏక తాటిపై ఉండాలని సూచించారు. దుమ్ముగూడెం ప్రాంతంలో సీతారామ ప్రాజెక్టు వల్ల వాడ బలిజ రైతులు తమ భూములను కోల్పోతున్నారని, వారికి ప్రాజెక్టు పూర్తయ్యాక అందులో చేపల వేటపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జున రావు, రాష్ట్ర ముఖ్య సలహాదారు పూజారి వెంకటేశ్వర్లు, వాడబలిజ రాష్ట్ర యువ నాయకులు టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు తోట ప్రశాంత్, ఉపాధ్యక్షుడు గొర్ల మధు, చర్ల మండల అధ్యక్షులు ఎర్రావుల ప్రేమ్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కార్యవర్గం..

బూర్గంపాడు: ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల కమిటీని ఆదివారం సారపాకలో ఎన్నుకున్నారు. యూనియన్ మండల అధ్యక్షురాలిగా ఆకుల పద్మ, ఉపాధ్యక్షురాలిగా వర్సా శ్రీదేవి, వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ బుజ్జమ్మ, సహాయ కార్యదర్శులుగా వర్సా చిలకమ్మ,బర్మావత్ రాధ, కారం సావిత్రి, ప్రచార కార్యదర్శులుగా లక్ష్మీదేవి, రోజమ్మ, అవిటి జ్యోతి, మాచిన సత్యవతి, వారాల లక్ష్మీరజిత, రాజేశ్వరి,రమాదేవి, కోశాధికారిగా సపావత్ సోనాలతో పాటుగా మరో ఇరవైమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మాలమహానాడు మండల అధ్యక్షుడిగా శంకర్

చంద్రుగొండ: మాలమహానాడు మండల అధ్యక్షుడిగా చంద్రుగొండకు చెందిన బడుగు శంకర్‌ను నియమించారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతోటి కాంతయ్య ఈ మేరకు ఆదివారం నియామకపు లేఖను శంకర్‌కు అందించారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

- అధిక సంఖ్యలో లారీల్లో తరలింపు
- పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు



సీజ్ చేసిన ఇసుక నిల్వలను చూపుతున్న ఆర్‌ఐ భద్రు

ములకలపల్లి: ఇసుకాసురుల యథేచ్ఛగా తమ పని కానిచ్చేస్తున్నారు. అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా పదుల సంఖ్యలో లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. మూడు లారీలు, ఆరు ట్రాక్టర్లుగా వీరి దందా సాగుతోంది. ఇంతజరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

ఉమ్మడి పూసుగూడెం జీపీ పరిధిలోని పలుచోట్ల ఈ అక్రమం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పాల్వంచ పట్టణానికి దగ్గరగా ఉండడంతో సులువుగా లారీల్లో తరలించి, అక్కడ నుండి ఖమ్మం, హైదరాబాద్ వంటి పట్టణాలకు తరలిస్తున్నారు. వాగుల్లో ఇసుకను తోడేస్తూ.. కోట్లాది రూపాలయ అక్రమార్జనకు పాల్పడుతున్నారు, ఇష్టారీతిన ఇసుక తోడడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు.

తరలింపు ఇలా..

సాయంత్రం వేళ వాగులోని ఇసుకను ట్రాక్టర్లలో ఒడ్డుకు చేరుస్తున్నారు. రోడ్డుకు సమీపంలో తమకు అనువైన ప్రదేశంలో నిల్వ చేస్తున్నారు. లారీలు రాకపోకలు సాగించగలిగే ప్రాంతాల్లో భారీగా డంప్ చేసి, అర్ధరాత్రి వేళ బయటికి తరలిస్తున్నారు. ఇలా నిత్య కృత్యంగా ఇసుక రవాణ కొనసాగుతోంది. అధికారులు అప్పుడప్పుడూ దాడులు నిర్వహిస్తున్నా, అక్రమార్కులు మాత్రం నిరాటంకంగానే తమ పని కానిచ్చేస్తున్నట్లు తెలుస్తోంది.

హెలీప్యాడ్ నిర్మాణం పేరిట..?

పూసుగూడెం శివారులోని సీతారామ పంప్‌హౌస్-2 ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న క్రమంలో అధికారులు హుటాహుటిన హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టారు. ఇందుకుగాను అత్యవసరంగా స్థానిక వాగుల నుంచి ఇసుకను సమీకరించుకున్నట్లు తెలిసింది. ఇదే అదనుగా భావించిన అక్రమార్కుల హెలిప్యాడ్ నిర్మాణం పేరిట భారీగానే ఇసుక బయటికి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. పదికి పైగా ట్రాక్టర్లతో వాగులోని ఇసుకను బయటికి తోడినట్లు సమాచారం. భారీగా నిల్వ చేసి మూడు లారీల్లో ఇసుకను పాల్వంచ, ఖమ్మం పట్టణాలకు తరలించారని వినికిడి.

తెల్లవారేలోపు ఇసుక మాయం..

సంజీవ్‌పల్లి శివారులో ఓఇంటి వద్ద ఇసుక అక్రమంగా నిల్వ చేశారన్న విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రెవెన్యూ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఆర్‌ఐ భద్రు ఆధ్వర్యంలో 8 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. ఈ ఇంటి పక్కనే మరో ఇంటి ముందర నాలుగు ట్రాక్టర్ల ఉంది. దీన్ని గమనించిన రెవెన్యూ అధికారులు ఇసుక చుట్టూ ముగ్గు పోశారు. అయితే ఇంటి వారు ఇచ్చిన వాగ్మూలం మేరకు నిరుపేద దంపతులు ఇంటిని నిర్మించేందుకు ఇసుక తోలుకున్నారని, మానవతా దృక్పథంతో వదిలి వేస్తున్నామని ఆర్టై తెలిపారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే తెల్లవారే సరికల్లా అక్కడున్న నాలుగు ట్రాక్టర్ల ఇసుక మాయమైంది. ఇంటి ముందర ఇసుకను అక్రమార్కులు లారీల్లో బయటకు తరలించినట్లు సమాచారం. అధికారులు అడపాదడపా దాడులు చేసి, చేతులు దులుపుకుంటున్నారని, పటిష్ట నిఘా ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు

ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్ గుడ్ల పుల్లారావు ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం. అక్రమ రవాణాపై సమచారం అందించండి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– భద్రు, ఆర్‌ఐ–2, ములకలపల్లి

బోనమెత్తిన మహిళలు



గుండాల: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



అశ్వారావుపేట: బోనాలతో ప్రదిక్షణ చేస్తున్న మహిళలు



ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న దృశ్యం

గుండాల: శ్రావణమాసంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో బోనాల పండుగ స్థానికులు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామ దేవతలైన బొడ్రాయి, ముత్యాలములకు మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాల నడుమ పూర్ణాకాలతో మహిళలంతా నెత్తిపై బోనాలు పెట్టుకుని ఊరేగింపుగా బొడ్రాయి, ముత్యాలమ్మ ఆలయాలకు చేరుకున్నారు. గ్రామదేవతలకు నైవేథ్యం సమర్పించి, కోళ్లు మేకలను బలిచ్చారు. ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో ఉండాలని గ్రామదేవతలను వేడుకున్నారు.

అశ్వారావుపేట: మండల పరిధిలోని తిరుమలకుంట గ్రామంలో ఆదివారం ఘనంగా బోనాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉదయాన్నే ఇంటివద్ద సిద్ధం చేసిన పొంగళ్లను గ్రామదేవతల వద్దకు చేర్చి బొడ్రాయి వద్ద, గ్రామదేవతల వద్ద సమర్పించి జలాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ములకలపల్లి: శ్రావణ మాసం తొలి ఆదివారం నేపథ్యంలో భారీగా ప్రజలు గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ములకలపల్లిలోని శ్రీభక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో, సమీపంలోని బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి గ్రామశివారులోని ముత్యాలమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకున్నారు. మహిళలు, పిల్లలు బోనాలు నెత్తినెత్తుకొని అమ్మవారిని చీరె, సారె సమర్పించుకున్నారు. భక్తిప్రపత్తులతో పూజలు చేసి, నైవేథ్యాలు పెట్టారు. కోళ్లు, మేకపోతులు మొక్కులు చెల్లించుకున్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం భూముల్లో ఆక్రమంగా ఇళ్లు నిర్మించారని ఆదివాసీలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఘటన జరిగిన ప్రదేశాన్ని ఆదివారం ఆదివాసీ సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆదినారాయణమూర్తి, మల్లుదొర, తిరుపతిరావు, గోవిందరాజు, చంద్రయ్య, రంగమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జయంతి వేడుకలు



గుండాల: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న గౌడ సంఘం నాయకులు

మణుగూరురూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల గౌడుల ఐక్యత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల గౌడుల సంఘం ఆధ్వర్యంలో సురక్షా బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. తొలుత పాపన్న గౌడ్ చిత్రపటానికి సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొగల్ చక్రవర్తుల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడి, ప్రజలను బానిసత్వ బతుకుల నుంచి విముక్తి చేసిన పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. గౌడుల ఐక్యత సంఘం నాయకులు చిర్ర రవికుమార్, ముత్యంబాబు, తాళ్ళపల్లి యాదగిరిగౌడ్, నూనెముంతల సతీష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని అశ్వారావుపేట, తిరుమలకుంట గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అశ్వారావుపేటలో అమ్మ సేవా సదనంలో వృద్ధులకు గౌడ సంఘ అధ్యక్షుడు ఆరేపల్లి సాంబశివరావు, మైనం రామకృష్ణ, ఆరేపల్లి బాబూరావు తదితరులు పండ్లు పంపిణీ చేశారు.

గుండాల: బహుజనులు అణగారిన పేద ప్రజల కోసం అహర్నిశలు పనిచేసిన తెలంగాణ ఛత్రపతి సర్దార్ సర్వాయి పాపన్న అని పలువురు గౌడ సంఘం నాయకులు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో బత్తిని సాయన్న, యాసారపు తిరుపతి, బొంగు సిద్దయ్య, బుసనబోయిన సమ్మయ్య, గుండెబోయిన నాగరాజు బత్తిని రమేష్, బొబ్బిలి సమ్మయ్య, ఊడుగుల, యాకయ్య, తీగల సురేష్, మాచర్ల రంజిత్, వై.యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పినపాక: మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తొలి బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని గౌడ సంఘం నాయకులకు కొనియాడారు. ప్రభుత్వం పాపన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలంలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఆర్‌ఎస్ బాలాజీ రాజు, కుంజ వెంకటరమణమూర్తిని టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి మాట్లాడుతూ.. భావి జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని, ఈ విరమణ సమయాన్ని సంఘ సేవకు సామాజిక స్పృహతో గడపాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.కృష్ణ, బి.కిషోర్ సింగ్, మురళీమోహన్, వెంకటేశ్వర్లు, తావూరియా, శైలజ, విజయ్ కుమార్, టీవీఎస్ ప్రసాద్, తేజావత్ బాలు, ఎం.సత్యనారాయణ, రాజా శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థిని హత్య దారుణం

చంద్రుగొండ: వెస్ట్‌బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హతమార్చడం దారుణమైన ఘటనగా సీపీఐ (ఎంఎల్) పార్టీ మండల నాయకులు వరికూటి వెంకట్రావ్ అన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాఖీ సందడి..!





కరకగూడెంలో రాఖీల కొనుగోలు..

కరకగూడెం: సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, అనురాగం, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే పండగ రాఖీ. ప్రతియేటా ఈ పండుగ శ్రావణ మాసంలోని శుక్లపక్ష పౌర్ణమి రోజున జరుపుకుంటారు. ఈ ఏడాదిలో నేడు రాఖీని జరుపుకునే నేపథ్యంలో ఆదివారం కరకగూడెం మండలంలో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. మండల కేంద్రంలో ప్రత్యేకంగా దుకాణాలను వ్యాపారస్తులు ఏర్పాటు చేశారు.రంగురంగుల రాఖీలు విభిన్న ఆకారాల్లో ఆకట్టుకుంటున్నాయి. తక్కువ ఖరీదు నుంచి ఎక్కువ ఖరీదు చేసే రాఖీలు అందుబాటులో ఉండడంతో ప్రజలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. అంతేకాకుండా బొమ్మలతో తయారు చేసిన రాఖీలు చిన్నారులను ఎంతగానో ఆకర్షించాయి. రాఖీలతో పాటు పండుగకు అవసరమయ్యే పూజా సామగ్రి, స్వీట్లు కూడా అందుబాటులో ఉండడంతో పలువురు మహిళలు, యువతులు అధిక సంఖ్యలో వాటిని కొనుగోలు చేశారు.

ఎట్టకేలకు పునరుద్ధరించారు..



ఇనుప వంతెనపై ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం

ములకలపల్లి: ములకలపల్లి శివారు పాములేరు వాగుపై ఇనుప వంతెన (ఐరన్ పాత్ వే)కు ఎట్టకేలకు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి పనులు మొదలుపెట్టిన క్రమంలో.. శిథిలావస్థలకు చేరిన మినీ బ్రిడ్జీని తొలగించి, తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు వేశారు. ఐతే భారీ వర్షాలకు డైవర్షన్ కొట్టుకుపోయి, రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో హుటాహుటిన పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెళ్లేలా ఇనుప వంతెన నిర్మించారు. ఐతే గత నెలాఖరున కురిసిన భారీ వర్షానికి వంతెన మధ్య పిల్లర్ నీటిలోకి దిగిపోయి కుంగిపోయింది. ఇనుప వంతెన కొంతమేర కుంగిపోయింది. ఛానల్స్ మెలితిరిగి వంగిపోయాయి. ఈ నేపథ్యంలో జూలై నెలాఖరు నుంచి వంతెనపై బైక్‌ల రాకపోకలు నిలిపివేశారు. నడక బాటగా మాత్రమే దీనిని వినియోగిస్తున్నారు. ఈక్రమంలో అధికారులు వంతెనకు మరమ్మతులు చేపట్టారు. కుంగిపోయిన బ్రిడ్జిని యథాస్థితికి తీసుకువచ్చి, కుంగిపోయిన పిల్లరు సమీపంలో నూతనంగా మరో పిల్లర్‌ను సపోర్ట్‌గా వేశారు. దీంతో గతంలో మాదిరిగానే ద్విచక్ర వాహనాలు కూడా మరలా వంతెనపైన ప్రయాణిస్తున్నాయి.

ఉపాధ్యాయుడి కుటుంబానికి అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఉపాధ్యాయుడు నిట్టా రాంబాబు కుటుంబానికి అండగా ఉంటామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భరోసా ఇచ్చారు. ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాంబాబు సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవిలు హాజరై రాంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూ.6లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. యూటీఎఫ్ హక్కుల కోసం శ్రమించడమే కాకుండా ఉపాధ్యాయుల సంక్షేమానికి, సామాజిక బాధ్యతకు కట్టుబడి ఉంటుందన్నారు. ఎంఈఓ వీరస్వామి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్షుడు కిషోర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, జిల్లా కార్యదర్శులు రాము, తావురియా, విజయ్, సీతారామయ్య, మురళీమోహన్, మండల ప్రధాన కార్యదర్శి మీరాహుస్సేన్, నాయకులు తోట విజయలక్ష్మి, స్వరూపారాణి, సూర్యనారాయణ, భాస్కర్, కిరణ్, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు పాల్గొన్నారు.

చెరువుకు గండ్లుపెట్టిన రైతులు

అశ్వాపురం: మండల పరిధిలోని పాములపల్లి గ్రామంలో పెద్ద చెరువుకు ఆదివారం రైతులు పలు చోట్ల గండ్లు పెట్టారు. రైతులు తమ పొలాలకు నీళ్ల కోసం చెరువుకు పలు చోట్లకు గండ్లు పెట్టారు. గ్రామ పెద్దలు చెరువుకు గండ్లు పెట్టడం సరికాదని పూడ్చివేయించారు.

వామ్మో.. వానరాలు!

- జనావాసాల్లో గుంపులుగా సంచారం
- ప్రభుత్వ పాఠశాల వద్ద తిష్ట
- విద్యార్థులు, స్థానికులపై దాడులు



ఎంపీడీఓ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆసుపాక గ్రామస్తులు (ఫైల్)



ఆసుపాక పాఠశాల గేటు వద్ద తిష్ట వేసిన కోతులు

అశ్వారావుపేటరూరల్: గడిచిన కొంతకాలంగా కోతులతో ప్రజలు, విద్యార్థులు సతమతం అవుతున్నారు. వానరాలు గుంపులుగా సంచరిస్తూ, ఇళ్లతోపాటు పాఠశాలల వద్ద తిష్ట వేసి భయందోళనకు గురి చేస్తున్నాయి. కోతుల దాడులతో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు గాయపడ్డారు. కోతుల సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అశ్వారావుపేటతోపాటు మండలంలోని ఆసుపాక, వినాయకపురం, వినాయకపురం కాలనీ గ్రామాల్లో ప్రధానంగా కోతుల బెడద అధికంగా నెలకొంది. అశ్వారావుపేటలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ ఏరియా, వెలమ బజారు, కొనేరు బజారుతోపాటు మరికొన్ని చోట్ల కోతులు అధికంగా సంచరిస్తున్నాయి. అయినా సరే ఇప్పటి వరకు సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమే. మూడేళ్ల క్రితం గ్రామ పంచాయతీ పాలక వర్గం తిర్మానంతో కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలారు. ఆ నాటి నుంచి మళ్లీ కోతులను పట్టుకునే చర్యలు తీసుకోలేదు. దీంతో వందల సంఖ్యలో కోతులు పెరిగిపోయి, ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థులను ఎత్తుకుపోతున్నాయి. ఇళ్ల పెరటిలో ఉండే పండ్ల మొక్కలు ధ్వంసం చేస్తున్నాయి. అడ్డుకునేందుకు యత్నిస్తే దాడులకు తెగబడుతున్నాయి.

పాఠశాల వద్ద ఇబ్బందికర పరిస్థితులు

మండలంలోని ఆసుపాక గ్రామంలో కోతుల సమస్య మరింత ఇబ్బందికరంగా ఉంది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో చెట్లు అధికంగా ఉండటంతో కొద్ది నెలలుగా కోతులు గుంపులుగా తిష్ట వేశాయి. పాఠశాల ఆవరణలోనే యథేచ్ఛగా తిరుగుతూ.. ప్రహరీ గోడపైనే ఉంటున్నాయి. పాఠశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉపాధ్యాయులపై దాడులకు యత్నిస్తున్నాయి. కోతుల భయంతో విద్యార్థులు బడికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు భయందోళన చెందుతున్నారు. అలాగే ప్రధాన రహదారులు, కిరాణా, హోటళ్ల వద్దకు గుంపులు వచ్చి చేతి కందిన ఆహారం, కూరగాయాలు, పండ్లు ఎత్తుకెళ్తున్నాయి. దుకాణాల వద్ద నుంచి కూరగాయాలు కొనుగోలు చేసి కవర్లలో తీసుకెళ్లే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇప్పటికే సుమారు పది మంది గ్రామస్తులు, మరికొంత విద్యార్థులు కోతుల దాడులతో గాయపడ్డారు. తమ గ్రామంలో నెలకొన్న కోతుల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఈ నెల 9వ తేదీన అశ్వారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఏలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు, డీఈవోకు త్వరలోనే ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెబుతున్నారు.

కిరాణా కొట్టుకు వెళ్లి వస్తుంటే..

గ్రామంలోని ఓ కిరాణా కొట్టుకు వెళ్లి ఇంట్లోకి నిత్యవసరాలు, కూరగాయాలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్తుంటే.. ఒక్కసారిగా కోతుల గుంపు దాడి చేశాయి. చేతిలో ఉన్న సంచిని లాక్కోని, కాళ్లపై కరిచాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కోతులను పట్టుకోని అడవిలో వదలాలి.

– పెనుబోయిన సత్తిబాబు, బాధితుడు, ఆసుపాక

కోతులు పట్టేందుకు నిధులు లేవు

గ్రామంలో కోతుల సమస్య అధికంగా ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కానీ గ్రామ పంచాయతీలో నిధులు లేవు. ఒకోక్క కోతిను పట్టుకునేందుకు రూ.500దాకా ఖర్చు అవుతోంది. నిధులు మంజూరు కాగానే చర్యలు తీసుకుంటాను.

– మోతీలాల్, ఆసుపాక జీపీ కార్యదర్శి